క్లుప్తంగా

'ఓటు హక్కుపై చైతన్యవంతం చేయాలి'

లింగాలఘణపురం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుపై విద్యార్థులు తమ తల్లిదండ్రులను చైతన్యవంతం చేయాలని వనపర్తి పీవీఆర్ పాఠశాల కరెస్పాండెంట్ వెంకట్‌రెడ్డి కోరారు. శనివారం పాఠశాలలో విద్యార్థులకు 'ప్రజాస్వామ్యంలో ఓటరు పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఓటరు నిర్లక్ష్యం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, బుల్లెట్ కంటే బ్యాలెట్ బలమైందన్నారు. వ్యాస రచన పోటీల్లో ప్రథమ స్థానంలో పుష్ప ప్రశంస, ద్వితీయ స్థానంలో పెండల అక్షర నిలువగా వారికి బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

● విద్యుత్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి

బచ్చన్నపేట: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈ లక్ష్మీనారాయణ రెడ్డి శనివారం తెలిపారు. బచ్చన్నపేట సెక్షన్‌లో ఆలింపూర్ ఏజీఎల్, బసిరెడ్డిపల్లి, ఎద్దుగూడెం లోని మూడు 11 కేవీ ఫీడర్లలో నూతనంగా 600 కేవీఏఆర్ కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీంతో రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని తెలిపారు. ఏడీఈ వేణుగోపాల్, ఏఈ రాజ్ కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అభినందనీయం

కొడకండ్ల: ఏడునూతుల ప్రాథమిక పాఠశాల అభివృద్ధిలో మాజీ హెచ్‌ఎం మురళీకృష్ణ కృషి అభినందనీయమని మండల ఎంఈఓ గ్రేస్‌కే జీయారాణి అన్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల నమోదును పెంచడంతో పాటు పాఠశాల నుంచి బదిలీ అయినా కూడా తన వంతుగా ప్రింటర్, స్కానర్ శనివారం బహూకరించారని అన్నారు.

'అహంకార పూరిత మాటలు మానుకోండి'



జనగామ: తెలంగాణలో గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపించినా, పార్టీ నేతలు ఇప్పటికీ అహంకార పూరితంగా మాట్లాడుతున్నారని టీడీపీ నాయకుడు రామిని హరీశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో పట్టణ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి మాట్లాడిన ప్రతి మాటను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ప్రజలు సమాధి కట్టారన్నారు. బాధ్యతాయుత మైన ఎమ్మెల్యే పదవిలో ఉంటూ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడిన మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు జేరుపోతుల కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి ఎల్లేష్, మైనార్టీ నాయకులు ఎండీ ఇక్బాల్, దేవునూరి సంపత్, గుగులోతు కనకరాజు, ఎండి యాకూబ్ పాషా, తేజావత్ అజయ్ ఉన్నారు.

స్క్రీనింగ్ స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోండి

నర్మెట: ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ప్రాథమిక కేంద్రంతో పాటు ఆయా సబ్‌సెంటర్లలో ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ స్క్రీనింగ్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రజలు వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి వైద్యం ఉదయ్ కిరణ్ అన్నారు. మార్చి 31 వరకు మండలంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎస్ఎన్ సునీత, సిబ్బంది బుద్దా శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

'అవినీతిపై విచారణ చేపట్టాలి'

కొడకండ్ల: మండలంలోని పెద్దబాయితండ మాజీ సర్పంచ్ భర్త రమేశ్ అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తండాకు చెందిన గిరిజనులు శనివారం ఎంపీడీఓ నాగేశ్వరాచారికి ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసిన స్థలంలో కాకుండా వేరే చోట గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించాడని, మరుగుదొడ్ల బిల్లులు కాజేశాడని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఇప్పిస్తానని 30 మంది వద్ద డబ్బులు తీసుకున్నాడని, ఇందుకు సంబంధించి ఆధారాలు కూడా ఉన్నందున విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వారు ఎంపీడీఓను కోరారు. రవీందర్, లక్‌పతి, బాలాజీ, దంజా, కిష్టు, ప్రవీణ్, రాంకోటి, బీచ్యా పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

లింగాలఘణపురం: బండ్లగూడేనికి చెందిన గాని శ్రీనివాస్ శనివారం ఉదయం తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడి తీవ్రంగా గాయపడ్డాడు. రోజువారిగా తాటిచెట్టు ఎక్కి కల్లుతీసి ఉపాధి పొందే శ్రీనివాస్ చెట్టు నుంచి జారిపడడంతో పక్కటెముకలు విరిగాయి. వెంటనే గమనించిన తోటి గీత కార్మికులు జనగామ ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రి ఉన్నట్టా.. లేనట్టా..?

● చెన్నూరులో హోమియో దవాఖానకు ఎనిమిది నెలలుగా తాళం
● ఇబ్బంది పడుతున్న ప్రజలు



వైద్యుడు లేక తెరుచుకోని హోమియో ఆస్పత్రి

పాలకుర్తి టౌన్: పాత నియోజకవర్గ కేంద్రమైన చెన్నూరులో ప్రభుత్వ హోమియో ఆస్పత్రి ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందించి. ఆ ఆస్పత్రి ఇప్పుడు మూతపడే దశకు చేరింది. దీంతో గ్రామస్తులు అసలు ఆస్పత్రి ఉన్నాట్లా లేనట్లా అంటున్నారు. ఏడాద క్రితం ఆప్పత్రికి ఇన్‌చార్జ్ డాక్టర్‌ను నియమించి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఎనిమిది నెలల నుంచి ఎవరిని నియమించిన దాఖలాలు లేవు. దీంతో చెన్నూరు గ్రామస్తులకు వైద్య సేవలు అందించే వారు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. 1993లో అప్పటి ఎమ్మెల్యే యతిరాజారావు నియోజక వర్గ కేంద్రమైన చెన్నూరు(పాత)లో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రి భవనాన్ని నిర్మించి ప్రాభంభించారు. కొన్నేళ్ల పాటు ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు సక్రమంగానే అందించారు. డాక్టర్ కూడా గ్రామస్తులకు అందుబాటులో ఉండేవారు. ఆ తర్వాత విధులు నిర్వహించిన డాక్టర్ నవాజీష్ అలీ పదవీ విరమణ పొందడడంతో ప్రభుత్వం ఇన్‌చార్జ్ డాక్టర్‌ను నియమించింది. అప్పటి నుంచి ఈ ఆస్పత్రికి రావడానికి డాక్టర్లు ఇబ్బందులు పడేవారు. అయితే ఎనిమిది నెలల క్రితం ఒక డాక్టర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించగా అతను కూడా అడపాదడపా వచ్చి విధులు నిర్వహించేవాడు. అయితే ఎనిమిది నెలలుగా సిబ్బంది కూడా తాళం తీస్తున్న దాఖలాలు కనిపించడం లేవని గ్రామస్తులు ఆరో పిస్తున్నారు. సిబ్బంది ఎవరూ ఉండక పోవడంతో ఈ ఆస్పత్రి ఉన్నట్లే ప్రజలు మర్చిపోయారు. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశ్వసినిరెడ్డి స్పందించి ఆస్పత్రికి సిబ్బందిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



గ్రామంలో హోమియో ఆస్పత్రిలో గత ఎనిమిది నెలలుగా వైద్యుడు లేక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే వైద్యుడిని నియమించాలి. ఆస్పత్రిలో ప్రజలకు వైద్య సేవాలు అందేలా చూడాలి.

\- పోలాస సోమయ్య, చెన్నూరు

డాక్టర్‌ను నియమిస్తాం

చెన్నూరులో పనిచేసిన హోమియో డాక్టర్ మమత సాధరణ బదిలీల్లో భాగంగా ఎనిమిది నెలల క్రితం దేవరుప్పుల మండలం పెద్దమాడూరుకు బదిలీపై వెళ్లారు. చెన్నూరు డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. డాక్టర్‌ను నిమించి వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- బి రవినాయక్, ఆయుర్వేద శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్

రాజకీయ లబ్ధికోసమే డ్రామాలు

● కడియంపై ఎమ్మెల్యే పల్లా ఫైర్



పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ : గండి రామారం చెరువు వద్ద ఎమ్మెల్యే కడియం శ్రీహరి డ్రామాలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం విడ్డూరంగా ఉందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. దేవాదుల ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికులు ఆందోళన చేపట్టినప్పుడు పట్టించుకోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పంపింగ్ ప్రారంభించగానే తగుదున్నమ్మా అంటూ వెళ్లి రైతుల మధ్య చిచ్చుపెట్టే విధంగా వ్యవహరించడం సరికాదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. కార్మికుల ఆందోళనతో పక్షం రోజులుగా మోటార్లు ఆగిపోయాయని, దీంతో ధర్మసాగర్ నుంచి గండిరామారం రిజర్వాయర్‌కు నీటి తరలింపు నిలిచి పోయిందని వెల్లడించారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు అధికారులతో అనేక దఫాలుగా రిక్వెస్ట్ చేసి, కార్మికులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయగా, మోటార్లను ఆన్ చేయించడం జరిగిందని పేర్కొన్నారు. గోదావరి జలాలు గండిరామారం రిజర్వాయర్ ద్వారా బొమ్మకూరు, కన్నెబోయినగూడెం, వెల్దండ, లద్నూర్, తపాస్‌పల్లి ప్రాజెక్టులకు పంపాల్సి ఉందన్నారు. దీంతో జనగామ నియోజకవర్గంలో 80 శాతం ఆయకట్టుకు సాగునీరు చేరుతుందన్నారు. ఓఎస్‌ఎం కార్మికులు ఆందోళన బాట పట్టిన వెంటనే అధికార పార్టీ నేతలు, ఎమ్మెల్యే శ్రీహరి స్పందించి ఉంటే ఇంతటి కరువు పరిస్థితి ఉండేది కాదని విమర్శించారు. తన కృషితోనే ఓఎస్‌ఎం కార్మికుల సమస్యలు తీరి, మోటార్లు ఆన్ చేసిన వెంటనే, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తగుదునమ్మా అంటూ గండిరామారం రిజర్వాయర్ వద్దకు వెళ్లి, అమాయక రైతులు మధ్య చిచ్చు పెట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. అన్ని ప్రాంతాల రైతుల పొలాలకు సాగునీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులు, పోలీసులను కోరుతున్నట్లు చెప్పారు. పంటలు దెబ్బతినే విధంగా నిర్లక్ష్యం చేస్తే, రైతుల కోపాగ్నికి గురికాక తప్పదని హెచ్చరించారు.

కొనసాగుతున్న విద్యా మహోద్యమం

జనగామ రూరల్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 15శాతం నిధులు కేటాయించాలని సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా మహోద్యమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం పట్టణంలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో విద్యమహోద్యమ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ మాట్లాడుతూ బడ్జెట్ ప్రవేశ పెట్టే రోజు వరకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులు సీఎంకు విద్యా రంగానికి నిధులు కేటాయించాలని పోస్ట్ కార్డులు రాసి పంపారు. కార్యక్రమంలో ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న వెంకన్న

పాలకుర్తి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని గిరిజన గురుకుల పాఠశాలల డిప్యూటీ సెక్రటరీ డీఎస్ వెంకన్న అన్నారు. శనివారం గూడూరు గ్రామంలోని గిరిజన గురుకుల పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ప్రిన్సిపాల్ రేణుక రాథోడ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వెంకన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో నర్సంపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత సాగర్, ఎంపీడీఓ ఆవుల రాములు, ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, మాజీ సర్పంచ్ మాచర్ల పుల్లయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న అదనపు డీఆర్‌డీఓ చంద్రశేఖర్

● అదనపు డీఆర్‌డీఓ చంద్రశేఖర్

జఫర్‌గఢ్: నర్సరీల్లో పెంచుతున్న ప్రతి మొక్కను సంరక్షించాల్సిన అవసరం ఉందని అదనపు డీఆర్‌డీఓ చంద్రశేఖర్ కోరారు. ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మంపేట, అల్వార్ బండాతండా (శంకర్‌తండా)లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల ద్వారా వివిధ రకాల 14 వేల మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. వీటిని సంరక్షించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. నర్సరీల్లో ఖాళీగా ఉన్న బ్యాగులను గుర్తించి వాటిలో విత్తనాలను వేసి మొలకెత్తేలా చూడాలన్నారు. ప్రతి నర్సరీల్లో వందశాతం మొక్కలను సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. రానున్న వర్షాకాలంలోగా మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని అన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ సుమన్, ఏపీఓ రాజకరుణ, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రహరీ..



ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ప్రహరీ

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్ శివారులో దొంగల బారీ నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను కాపాడుకునేందుకు రైతులు వినూత్న ఆలోచన చేశారు. లక్ష్మీతండా రహదారిలో వ్యవసాయ బోర్ల వద్ద 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి కాపర్‌వైరు ఎత్తుకెళ్లారు. వారం రోజుల క్రితం విద్యుత్‌శాఖ అధికారులు మరో ట్రాన్స్‌ఫార్మర్ బిగించి జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఉన్న ఐదుగురు రైతులు రూ.7,500 జమచేసుకొని ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రీకాస్ట్ ప్రహరీ ఏర్పాటు చేశారు. మరమ్మతు, ఇతర పనుల కోసం లోనికి వెళ్లేలా ఓ వైపు ఖాళీగా ఉంచారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగల బారి నుంచి కాపాడుకేందుకు, పశువులకు ఎలాంటి ప్రమాదాలు బోటు చేసుకోకుండా.. రైతుల ఆలోచనను ఖిలాషాపూర్ విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ అభినందించారు.

వాటర్ ప్యూరిఫయర్‌కు మరమ్మతు చేయరా?

రఘునాథపల్లి: వెల్ది మోడల్ స్కూల్‌లో విద్యార్థులు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నా, అధికారులు రెండేళ్లుగా వాటర్ ప్యూరిఫయర్‌కు మరమ్మతు చేయరా అని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పాదల లవకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్ ఆరోపించారు. శనివారం వెల్ది మోడల్ స్కూల్‌ను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వారు పాఠశాల సందర్శించి మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం

ఆలయ నిర్మాణానికి విరాళం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని తిరుమలనాథస్వామి దేవాలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి ఘన్‌పూర్‌కు చెందిన భక్తుడు కుంభం గణేష్-లావణ్య దంపతులు రూ.25వేలు విరాళం అందజేశారు. అదేవిధంగా గోనెల మొగిళి, శ్రీమతి దంపతులు రూ.5,116 అందించారు.

శివాలయం అభివృద్ధికి..

చిల్పూరు: పల్లగుట్టలోని పురాతన శివాలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన బాసెట్టి హరిప్రసాద్ రూ.20 వేల విరాళం శనివారం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి విరాళాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

పాలకుర్తి: చెన్నూరు గ్రామంలో నిర్మిస్తున్న సీతారామచంద్ర స్వామి ఆలయ పనులను వ్యాపార వేత్త, దాత ఇమ్మడి సోమనర్సయ్య బ్రదర్స్ పరిశీలించారు. పార్వతి రాజేశ్వర్‌రావు, కలింగరావు, వేణు, శ్రీనివాస్, హరీశ్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కొడకండ్ల: ఏడునూతుల గ్రామ శివారులోని డీఫ్లోరైడ్ ప్రాజెక్ట్ ప్రాంతంలోని చెరువు కట్టకు సంబంధించిన తుమ్మ చెట్లను నరికి చట్ట విరుద్ధంగా వేలం నిర్వహించిన నాయకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాయారపు కన్నయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ చంద్రమోహన్‌కు ఆయన ఫిర్యాదు చేశారు.

ఆర్థికసాయం

పాలకుర్తి: లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన తూడి నాగన్న అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, శనివారం బాధిత కుటుంబాన్ని అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ సభ్యులు పరామర్శించి రూ.7,600 సాయం అందజేశారు.

సరోత్తంరెడ్డికి పట్టం కట్టండి

దేవరుప్పుల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి పట్టం కట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్ కోరారు. శనివారం మండలంలోని పెద్దమడూర్, చిన్నమడూర్, సింగరాజు పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో సరోత్తం రెడ్డి కోసం విస్తృత ప్రచారం చేపట్టారు. పెద్దగాని రాజు, కాసాని సత్యనారాయణ, గుంటి అజయ్, మడికొండ మహేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి

జనగామ రూరల్: యశ్వంతాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఆనుకొని ఉన్న చెరువు కట్టను ముందుకు జరిపి ప్రహరీ నిర్మించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల మహేశ్ కోరారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసి సత్కరించారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

దేవరుప్పుల: వాగు పరివాహక ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు అనివార్యమని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని కడవెండి వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలించే ప్రాంతాలను గుర్తించి వాహనాలు వెళ్లకుండా కందకాలు తీయించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ఇప్పగూడెం-రఘునాథపల్లి రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. జనగామ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం .. వరంగల్ కరీమబాద్‌కు చెందిన నూకల నరేశ్ (33) కొన్నాళ్లుగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన నరేశ్ గోవర్ధనగిరి సమీపంలో పట్టాలపై చేరుకొని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రఘునాథపల్లి: ఖిలాషాపూర్‌కు చెందిన బొల్లపల్లి కృష్ణమూర్తి (50) ప్రమాదవశాత్తు కింద పడి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లపల్లి కృష్ణమూర్తి కొన్నాళ్ల క్రితం భార్యతో గొడవ పడటంతో ఆమె కుమారులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటుంది. ఒంటిరిగా నివసిస్తున్న కృష్ణమూర్తి ఈ నెల 15న అతిగా మద్యం సేవించడంతో ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలయ్యాడు. స్థానికులు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

పంటపొలాలకు సాగునీరు అందిస్తా

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

చిల్పూరు: రైతులకు ఇబ్బంది లేకుండా పంటపొలాలకు సాగునీరు అందించే బాధ్యత నాదేనని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని ఫత్తేపూర్, గార్లగడ్డతండాలను శనివారం కడియం సందర్శించారు. ముందుగా పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించడంతో పాటు సాగునీటి అవసరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. మల్లన్న గండి రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రిజర్వార్ కట్టపైనే రైతులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లన్న గండి ఎడమ కాల్వ నిర్మాణానికి సర్వే పూర్తి అయి భూసేకరణ కూడా జరిగిందన్నారు. త్వరలో ఎడమ కాల్వ నిర్మాణం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. వచ్చే వర్షాకాలంలోపు పైప్‌లైన్ సామర్థ్యం పెంచి చెరువులు నింపి రెండు పంటలకు సాగునీరు అందేలా కృషిచేస్తానన్నారు. ఏమైనా సమస్య ఉంటే తనదృష్టికి తేవాలన్నారు. చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, నాయకులు మల్లారెడ్డి, సురేష్, రంగు రమేష్, షకీల్, పుల్యాల నారాయణరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, ఏదునూరి రవీందర్, స్వామినాయక్, అధికారులు పాల్గొన్నారు.

సాగు నీరు అందించాలి: యశస్వినిరెడ్డి

పాలకుర్తిటౌన్: సాగునీరు సవ్యంగా అందించాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సాగునీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఫోన్‌లో అధికారులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని మండలాల్లో వరి, మొ క్కజొన్న, ఇతర ఆరుతడి పంటలు వేసుకున్నారని, ఎండల తీవ్రత పెరిగిన దృష్ట్యా పంటలకు సాగునీరు సక్రమంగా అందించాలని అధికా రులను ఆదేశించారు.

పంటలకు సాగునీరు అందించాలి

జనగామ రూరల్: వేసవి దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే సాగునీరు అందించాలని పలు గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి, ఇరిగేషన్ డీఈ మంగీలాల్‌కు వినతి పత్రం అందజేశారు. కాగా, ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పంటలు ఎండిపోకుండా నీటిని విడుదల చేయాలని కోరినట్లు వారు తెలిపారు.

విజ్ఞానం పెంపొందించుకోవాలి

బచ్చన్నపేట: గురువుల హిత బోధ ద్వారా ప్రతి ఒక్కరూ విజ్ఞానం పొందాలని అచల యోగ ఫౌండేషన్ అధ్యక్షుడు మహారాజయోగి బ్రహ్మానంద రాపెల్లి శ్రీధరస్వామి అన్నారు. శనివారం ఫౌండేషన్ ఆశ్రమంలో 11వ గీతాయజ్ఞం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి భక్తులకు విజ్ఞాన యోగంపై బోధించారు. భగవద్గీత 2వ అధ్యాయం విజ్ఞాన యోగంపై శనివారం నుంచి వారం రోజుల పాటు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు భక్తులకు వివరించడం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వారకల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చిల్పూరు: మండలంలోని చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం భక్తజన సందోహం మధ్య అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వైభవంగా స్వామివారి వారకల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ధర్మకర్తలు గనగోని రమేష్, తాళ్లపల్లి బుచ్చయ్య, రత్నాకర్‌రెడ్డి, చల్ల వెంకటరమణాదేవి, గోలి రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు హైదరాబాద్‌కు చెందిన జగ్గన్నగారి వెంకటసాయి-కీర్తన, నరసింహారెడ్డి-సరళ దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు.

స్వయంపాలన దినోత్సవం



కొడకండ్ల: మండలంలోని ఏడునూతుల ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓగా రహమాన్, హెచ్‌ఎంగా ఫారియాలతో పాటు పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యా బోధన చేయగా మండల ఎంఈఓ గ్రేస్‌కేజీయారాణి ముఖ్య అతిథిగా పాల్గొని వారిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, మురళీకృష్ణ, బాలశౌరెడ్డి, శివరాత్రి వెంకటేశ్వర్లు, రేణుక, శ్రీనివాస్, వీరస్వామి, కళ్యాణి పాల్గొన్నారు.

వరద కాల్వల నిర్మాణంలో నిర్లక్ష్యం

సీపీఐ మండల కార్యదర్శి రమేశ్

జఫర్‌గఢ్: సాగునీటికి సంబంధించిన వరద కాల్వల నిర్మాణ పనులను పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్ పేర్కొన్నారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పుగల్లు రిజర్వాయర్ నుంచి చేపట్టిన వరద కాల్వలను నాయకులు, కార్యకర్తలు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఉప్పుగల్లు రిజర్వాయర్ నుంచి తమ్మడపల్లి (ఐ), జఫర్‌గఢ్ పెద్ద చెరువు మీదుగా హిమ్మత్‌నగర్, తమ్మడపల్లి (జి) తదితర గ్రామాల నుంచి పాలకుర్తి చెరువు వరకు చేపట్టిన ప్రధాన కాల్వ నిర్మాణ పనులు ఏళ్లతరబడి పూర్తికాక అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. చిన్న కాల్వల పనులు ఇంకా మొదలు పెట్టలేదన్నారు. దేవాదుల ద్వారా ప్రతీ ఎకరాకు సాగునీరందించి రైతులను ఆదుకుంటానని ఇచ్చిన హామీని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల సమ్మయ్య, మంద బుచ్చయ్య, ఎర్రం సతీష్, ఎర్రం యాదగిరి, గడ్డి రాజు, పెండ్యాల కొమురయ్య, బుల్లె సాయిలు, బుల్లె రాములు, నాగరాజు, చిల్లర రాజు, నల్లా సమ్మిరెడ్డి, బుస రాజు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మొక్క నాటుతున్న శారద

నర్మెట: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం మిషన్ కోఆర్డినేటర్ శారద అన్నారు. బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లాలో పదివేల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మొక్కలు నాటిన అనంతరం ఆమె మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ బిరుకూరి రమాదేవి, సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టులు పవిత్ర, హేమలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నర్సిరెడ్డిని గెలిపించండి'



మాట్లాడుతున్న సోమన్న

పాలకుర్తి టౌన్: ప్రజాక్షేత్రంలో నిత్యం పనిచేసే ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దండిగ సందీప్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని నర్సిరెడ్డిని గెలిపించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తి దారుల సంఘం జిల్లా కార్యదర్శి ఏదునూరి మదార్, సీఐటీయూ నాయకులు మాసంపెల్లి నాగయ్య,వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి మండలంలో..

రఘునాథపల్లి: ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాపురం మహేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పాదల లవకుమార్ కోరారు. శనివారం మండలంలోని నిడిగొండ, రఘునాథపల్లిలో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. వారి వెంట బనకర్ల మనిత్ రాజ్ తదితరులు ఉన్నారు.